క్లుప్తంగా

ఉపాధి కూలీల ఆరోగ్య భద్రతే కర్తవ్యం



ఉపాధి కూలీలతో ఏపీవో

యాదమరి: ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో పను లు చేస్తున్న ఉపాధి కూలీలకు నీడ కల్పించాలని మండల ఏపీఓ బాల పేర్కొన్నారు. మండలంలోని మాధవరం గ్రామపంచాయతీలో జరుగుతున్న పనులను మంగళవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వైద్యాధికారుల సహకారంతో ఆశా వర్కర్ల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు భూదేవి, గౌతమి, ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్ పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: వేసవిలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. పాపసముద్రం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, షుగ ర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులను ఉచితంగా అందజేశా రు. మంచాన పడ్డ రోగుల ఇంటివద్దకే వెళ్లి చికిత్సలు చేశారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేసుకుంటే రూ.5వేలు అందజేయనున్న ట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ, చంద్రశేఖర్, రుక్మి ణి, కవిత, బుజ్జమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ అవసరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని పాలకలలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు అర గంట సమ యం యోగా, ధ్యానం చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా



వసంతాపురం సచివాలయంలో రైతులకు అందజేస్తున్న యూరియా

గుడిపాల: మండలంలో ఉన్న రైతులందరికీ యూరియా అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండలంలో ఉన్న 17 సచివాలయాలకు యూరియా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వసంతాపురం సచివాలయంలో రైతులకు యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆధార్‌కార్డ్ తీసుకొని యూరియా తీసుకోవచ్చన్నారు. అన్ని సచివాలయాలకు దశల వారీగా యూరియా వస్తుందని చెప్పారు. 45 కేజీల బస్తారూ.267కు విక్రయించనున్నట్లు చెప్పారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

పూతలపట్టు: ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య హెచ్చరించారు. మండలంలోని పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఆపరేషన్ థియేటర్, వార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలోని ఎక్కువ నిల్వ ఉంచిన చిక్కులను, వంట గదిని పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న వంటగదిని చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరి వెంట వైద్యాధికారి కుమారరాజ, అంగన్‌వాడీ సిబ్బంది శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనం



గుడిపాల మండలంలో ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది

సర్వేలతో సతమతం!

- కూటమి సర్కారు అనాలోచిత నిర్ణయం
- పంచాయతీ కార్యదర్శులకు పెనుభారం
- ఉన్నతాధికారుల ఒత్తిడి తీవ్రం

గుడిపాల: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనాలోచిత చర్యలు, నిర్ణయాలకు గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు మానసిక వేధింపులకు, తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పనిభారం పెంచి టార్గెట్‌లు విధించి జిల్లా, మండల స్థాయి అధికారుల ద్వారా తీవ్రంగా వేధిస్తుండడంతో కార్యదర్శులు హడలిపోతున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను జవాబుదారీగా చేస్తూ మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోం, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, పీ 4 సర్వే, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే, పీఎస్‌ఎస్ సర్వే, లేథర్ ఆర్డినెన్స్ సర్వే, 0–6 ఏళ్ల పిల్లల ఆధార్ మిస్సింగ్ సర్వే, నాన్ ఏపీ రెసిడెన్స్ సర్వే, ఇంటిపన్నులు, కుళాయి పన్నుల వసూళ్లను అంటగడుతున్నారు. ఆయా సర్వేలపై ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరించి చిన్న విషయానికి కూడా కార్యదర్శులను వివరణలు అడుగుతుండటంతో సచివాలయ సిబ్బంది సతమతమవుతున్నారు. అంతిమంగా ఈ పనిభారం మొత్తం ప్రోగ్రెస్ రూపంలో పంచాయతీ కార్యదర్శులపై పడి వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే మండలంలోని గ్రామాల్లో పనిచేస్తున్న పలువురు కార్యదర్శులు మూకుమ్మడిగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది.



చిరుపొట్ట దశలో ఉన్న వరిపంట

వరి ఆశాజనకం

గుడిపాల : మండల కేంద్రంతో పాటు పాపసముద్రం, పిళ్లారికుప్పం, చిత్తపార, బండపల్లె, బొమ్మసముద్రం, చింతగుంటూరు, ఎఎల్‌పురం, నారగల్లు తదితర గ్రామాల్లో రబీలో సాగు చేసిన వరిపంట ఆశాజనకంగా ఉంది. వరి నాట్లు వేసి 45 రోజులు కావడంతో చిరుపొట్ట దశకు చేరింది. వాతావరణం అనుకూలిస్తే మరో నెల రోజుల్లో పంట చేతికి వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో సుమారు 990 ఎకరాల్లో వరిపంట సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

తవణంపల్లె: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర మలేరియా డిప్యూటీ డైరెక్టర్ ఏ.టి రామనాథంరావు వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర మలేరియా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథంరావు, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, సబ్‌యూనిట్ అధికారులు శివసుబ్రమణ్యం, ఎస్.రామకృష్ణ సందర్శించారు. పీహెచ్‌సీలో డాక్టర్లు, వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించి సూచనలు, సలహాలిచ్చారు. గత మూడు నెలల్లో పీహెచ్‌సీలో నమోదైన జ్వరపీడితులపై ఆరా తీశారు. మండలంలో 4 జ్వరపీడితుల కేసులు నమోదైనట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక వివరించారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. మండలంలో పైపల్లె గ్రామాన్ని సందర్శించి డెంగీ జ్వరం సోకిన చిన్నారి ఆరోగ్యం గురించి వాకబు చేశారు. సచివాలయ పరిధిలో ఉన్న వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో తిరిగి ప్రజలకు డెంగీ జ్వరం, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా జ్వరాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ వినయ్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, శ్రీహరి, నిర్మలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ శేఖర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తవణంపల్లె పీహెచ్‌సీలో రామనాథంరావు, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

సర్టిఫికెట్ ఇవ్వలేదంటూ విద్యార్థి సెల్ఫీ వీడియో

చిత్తూరు టాస్క్‌ఫోర్స్ : జిల్లా కేంద్రంలోని మిట్టూరులో ఉన్న విజయం డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని బాధిత విద్యార్థి భార్గవ్ ఆవేదనతో మంగళవారం సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం ఆ విద్యార్థి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బాధిత విద్యార్థి వివరాల మేరకు, తాను విజయం డిగ్రీ కళాశాలలో 2020 నుంచి 2023 వరకు డిగ్రీ చదివినట్లు తెలిపారు. అడ్మిషన్ల సమయంలో తన వద్ద ఇంటర్మీడియట్ మార్కుల ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాల యాజమాన్యం తీసుకుందని చెప్పారు. అయితే యాజమాన్యం వాటిని అధ్యాపకుడు మోహన్‌నాయుడు వద్ద ఉంచినట్లు వెల్లడించారు. ఒకటిన్నర సంవత్సరం కళాశాలలో డిగ్రీ కోర్సు చదివిన అనంతరం కుటుంబ సమస్యల వల్ల చదువు మానేసినట్లు వాపోయారు. ఇటీవల వెళ్లి తన ఇంటర్మీడియట్ ఒరిజినల్ మార్కుల జాబితాను ఇవ్వాలని కోరగా పూర్తి ఫీజు చెల్లిస్తేనే ఇస్తామని చెబుతున్నారన్నారు. పూర్తి ఫీజు కట్టే స్థోమత తనకు లేదని వేడుకున్నట్లు తెలిపారు. తన ఆవేదనను ఏ మాత్రం పట్టించుకోకుండా ఒరిజినల్ మార్కుల జాబితానే ఇవ్వకుండా తనను బెదిరిస్తున్నారని వాపోయారు. తనతో పాటు చేరిన మిత్రులందరూ ఒరిజనల్ ఇంటర్ సర్టిఫికెట్లు అడ్మిషన్ల సమయంలో ఇచ్చినట్లు తెలిపారు. ఫీజు చెల్లించని కారణంగా తన సర్టిఫికెట్ ఇవ్వలేదని చెబుతున్నారని కన్నీరుమున్నీరయ్యారు. కళాశాల యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసి, కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని వేడుకుంటానని బాధిత విద్యార్థి వెల్లడించారు.



విద్యార్థి భార్గవ్

యువత పోరుకు తరలిరావాలి

బంగారుపాళెం: జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో యువత హాజరు కావాలని మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో యువతకు అండగా ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మండలం నుంచి పెద్ద సంఖ్యలో యువత పాల్గొనాలన్నారు.

విద్యార్థులు ఉన్నతాశయంతో ముందుకు సాగాలి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు ఉన్నత ఆశయంతో ముందుకు సాగాలని యూత్ ఫర్ బెటర్ చిత్తూరు సంస్థ ప్రతినిధి విష్ణు అన్నారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని వరదప్పనాయుడు నగరపాలక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. భవిష్యత్‌ను నిర్ణయించేది పరీక్షలేనని చెప్పారు. ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలను రాయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు తదితర సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్, ముక్తార్ అహ్మద్ పాల్గొన్నారు.



విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న యూత్ ఫర్ బెటర్ చిత్తూరు సంస్థ ప్రతినిధి విష్ణు

పశువులకు టీకాలు వేయించుకోవాలి

గుడిపాల: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి ప్రమాదకరమని పశువైద్యాధికారి సాయిసుధ అన్నారు. ఈ వ్యాధి సోకకుండా ముందుగానే పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. మండలంలోని పాపసముద్రం, క్రిష్ణజమ్మాపురం పంచాయతీలో మంగళవారం సుమారు 300 పశువులకు జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గాలికుంటు టీకాలను ఆమె పశువులకు వేశారు. ఈ టీకాల వల్ల వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ప్రతి ఒక్క పాడి రైతు టీకాలను తప్పనిసరిగా వారి పశువులకు వేయించుకోవాలన్నారు. నాలుగు నెలల దూడల నుంచి ఈ టీకాలను వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్‌లు రవి, జ్యోత్స్న తదతరులు పాల్గొన్నారు.



గాలికుంటు టీకాలు వేస్తున్న డాక్టర్ సాయిసుధ

రైతు సేవా కేంద్రాల్లో పంటల నమోదు జాబితా

గుడిపాల: రబీలో రైతులు సాగు చేసిన పంటల నమోదు జాబితా మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి మాధవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1,698 మంది రైతులు 2,389 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేశారని తెలిపారు. పంటసాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు జాబితాల్లో ఉందా లేదా అని చూసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని గుర్తించి రాతపూర్వకంగా సంబంధిత వ్యవసాయ సిబ్బందికి తెలపాలని సూచించారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి 22వ తేదీన తుది జాబితాను విడుదల చేయడంతో పాటు గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



పంటల నమోదు జాబితాను చూస్తున్న రైతులు

ప్రాథమిక దశలో గుర్తిస్తేనే నివారణ సాధ్యం

యాదమరి: క్యాన్సర్ వంటి వ్యాధులను తొలి దశలో గుర్తిస్తే నివారణ సులభమని డీపీఎంఓ ప్రవీణ పేర్కొన్నారు. మండలంలోని సంతగేటు గ్రామంలో జరుగుతున్న ఎన్‌సీడీ సర్వేను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే పనితీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించకపోవడంతో ఆయువు తీస్తోందన్నారు. సకాలంలో గుర్తిస్తే, మెరుగైన వైద్యంతో క్యాన్సర్‌ను నివారించవచ్చని చెప్పారు. బీపీ, మధుమేహం, గుండెజబ్బు లక్షణాలుంటే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఈ తనిఖీలో హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేను తనిఖీ చేస్తున్న డీపీఎంఓ ప్రవీణ

ప్రపంచ గ్లకోమా వారోత్సవాల ర్యాలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) చిత్తూరు నగరంలో మంగళవారం గ్లకోమా వారోత్సవాలను ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ర్యాలీ చేశారు. అనంతరం అవగాహన సదస్సును నిర్వహించారు. ఆర్ఎంఓ సంధ్య మాట్లాడుతూ గ్లకోమా అనేది కళ్లకు సంబంధించిన వ్యాధి అన్నారు. కంటి లోపల పీడనం పెరిగి కంటి నరాన్ని చచ్చుబడి పోయేలా చేస్తోందన్నారు. తద్వారా కంటిచూపు నెమ్మదిగా తగ్గిపోతుందని చెప్పారు. ఈ సమస్యను తొలి దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు లత, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



నాంపల్లె బీటులో ఏఎన్ఆర్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఎఫ్ఎస్ సంకేత్

ఐరాల: మొక్కల సంరక్షణ కోసం అటవీశాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ట్రైనీ ఐఎఫ్ఎస్, చిత్తూరు వెస్ట్ రేంజ్ ఇన్‌చార్జ్ సంకేత్ సూచించారు. ఐరాల బీటులో మంగళవారం సెంట్రల్ నర్సరీ, నాంపల్లె బీటులో ఏర్పాటు చేసిన 20 ఎకరాల ప్లాంటేషన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్లాంటేషన్ విస్తీర్ణం, ఎన్ని మొక్కలు నాటారు, ఏఏ రకం మొక్కలు నాటారు, మొక్కల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు, ప్లాంటేషన్ నిర్వహణపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ నర్సరీలో నాటిన ప్రతి మొక్కను జాగ్రత్తగా పెంచాలని, ప్రతి మొక్కపై ప్రత్యేక బాధ్యత వహించాలని సూచించారు. ప్లాంటేషన్ నిర్వహణ సక్రమంగా కొనసాగించాలని, సిబ్బందిని కేటాయించి బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్లాంటేషన్ పర్యవేక్షిస్తూ ఉండాలని ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి ఆదేశించారు. అడవుల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అటవీశాఖ అధికారి రాకేష్‌కుమార్, బీటు అధికారులు రెడ్డిప్రసాద్, పద్మావతి, నిశ్చలబాబు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల నిర్వహణకు చర్యలు

గుడిపాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంఈఓ హసన్‌బాషా తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. మండలంలో ఆరు పాఠశాలలకు చెందిన 274 మంది విద్యార్థులు ఈ నెల 17నుంచి జరగనున్న పరీక్షలు రాయటానికి సంసిద్ధమైనట్లు తెలిపారు. దీని కోసం మూడు పరీక్ష కేంద్రాలు కేటాయించినట్లు వివరించారు. నరహరిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 145 మంది, బొమ్మసముద్రం ప్రభుత్వ పాఠశాలలో 60 మంది, కమ్మతిమ్మాపల్లె పాఠశాలలో 69 మంది హాజరుకానున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల్లో మౌళిక వసతుల్లో భాగంగా వెలుతురు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

అందని రెవెన్యూ సేవలు

- కార్యాలయంలో సిబ్బంది కరువు
- కంప్యూటర్లు లేవు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి సిబ్బంది కొరత ఒక వైపు, కంప్యూటర్ల కొరత మరోవైపు వేధిస్తోంది. అధికారులు, సిబ్బందికి అదనపు పనిభారం పడుతోంది. రెండు కంప్యూటర్లతో అవస్థలు పడుతున్నారు. ఈ కారణంగా ఆన్‌లైన్ పనులు మందగిస్తున్నాయి. ఇటీవల చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం అర్బన్ నుంచి విడిపోయి ప్రత్యేకంగా ఏర్పాటయింది. ఈ మేరకు అరకొరగా కొంత మంది సిబ్బందిని కేటాయించారు. పూర్తి స్థాయిలో సిబ్బందిని కేటాయించలేకపోయారు. దీంతో రెవెన్యూ సేవలు కుంటుపడుతున్నాయి. ప్రధానంగా కంప్యూటర్ ఆపరేటర్లు ఇద్దరు ఉండాలి. కానీ ఒకరిని కూడా నియమించలేదు. సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగానే ఉంది. ఇద్దరు వీఆర్‌వోలు, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను కూడా మంజూరు చేయలేదు. దీంతో కార్యాలయంలో ఉన్న సిబ్బంది పనులను సకాలంలో పూర్తి చేయలేక సతమతమవుతున్నారు. రెవెన్యూ సదస్సు అర్జీల పరిశీలన, రీసర్వే సమస్యలు వారికి తలకు మించిన భారంగా మారింది. దీనికి తోడు కంప్యూటర్లు లేకపోవడంతో రెవెన్యూ సేవలు అవస్థలమయంగా మారింది. ఉన్న రెండు కంప్యూటర్లతో నెట్టుకొస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి రూరల్ తహసీల్దార్ కార్యాలయ సమస్యలపై పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది

దానధర్మాలకు ప్రతీక రంజాన్

కార్వేటినగరం : దాన ధర్మాలకు ప్రతీక రంజాన్ పర్వదినమని జీడీ నెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. మంగళవారం కార్వేటినగరంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తౌఫీర్‌ఖాన్ ఆధ్వర్యంలో కృపాలక్ష్మి చేతుల మీదుగా 500 మందికి చీరలు, పంచెలు వితరణ చేశారు. రంజాన్ మాసంలో తనకు ఉన్నంతలో పేదలకు దాన ధర్మాలు చేస్తూ తన ఉన్నతిని చాటుకుంటారని పేర్కొన్నారు. అలాంటి వారిలో సుభాఖాన్, హమీద్‌ఖాన్ ఒక్కరని ఏటా రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు చీరలు, పంచెలు వితరణ చేసి తమ దానగుణాన్ని చాటుకోవడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, , స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, మైనారిటీ పట్టణ అధ్యక్షుడు రఫీ, సద్దాం, ముస్తాఫ్, సబ్బీర్, హిషాద్‌ఖాన్, సుందర్‌రాజ్, వెంకటరత్నం, మునికృష్ణ పాల్గొన్నారు.



ముస్లిం సోదరులకు చీరలు, పంచెలు వితరణ చేస్తున్న కృపాలక్ష్మి

ఇట్స్ టీ టైం

చిత్తూరు కార్పొరేషన్: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మంగళవారం చిత్తూరులో చిన్న దుకాణంలో టీ తాగుతూ కనిపించారు. ఆయన అక్కడ కనిపించడంతో పలువురు వెళ్లి కలిసి మాట్లాడారు. చిత్తూరు–తచ్చూరు రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు అదనంగా పరిహారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించామని ఆయన తెలిపారు. తిరుగు ప్రయాణంలో మిట్టూరులోని ఓ టీ దుకాణంలో పార్టీ నాయకులతో కలిసి టీ తాగారు. అనంతరం పార్టీ నాయకులతో సరదాగా ముచ్చటించి పయనమయ్యారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ నాయకులు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో కలిసి టీ తాగుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ